క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండ బీడులో నూతనంగా నిర్మించే సంపత్ వినాయకుని ఆలయానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నలిమిల్లి వేణు ప్రతాప రెడ్డి (బాబీ), ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, చేన్నకేశవ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కే అప్పారావు, పార్టీ నాయకులు కోట్ల శంకర్, నౌడు దుర్గారావు, నక్క శ్రీను, కుసుమే నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



మొగల్తూరులో బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జి.అనితా కుమారి

మొగల్తూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ జి.అనితా కుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫామ్, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు,తప్పుఒప్పులకు ఫామ్–8, ఓటు తొలగింపునకు ఫామ్–7ను వినియోగించాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ శిరీష పాల్గొన్నారు.

శరవేగంగా సచివాలయ భవన నిర్మాణం



సిసలిలో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ఏఈ రమేష్

కాళ్ల: మండలంలో సిసలి గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గణేశ్నరాంబాబు పర్యవేక్షణలో నిర్వహిస్తోన్న ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్ బుధవారం పరిశీలించారు. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌వైర్లు తగిలి గడ్డివాము దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉండి: స్థానిక దేవునిగుడిదొడ్డి ప్రాంతంలో గేదెల వ్యాపారి బూరాడ సత్తిబాబుకు చెందిన గడ్డివాము బుధవారం ఉదయం విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ జిల్లా ఇన్‌చార్జి సాలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు.

రైతుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో చినమల్లం రైతులకు పవర్ టిల్లర్లు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



కొడమంచిలిలో ఈదురుగాలులకు పడిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో పెనుగొండ మండలం చినమల్లంకు చెందిన రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు ద్వారా సాంకేతికత, యంత్రాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు చేరువ చేశారన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను ఇతర రాష్ట్రాల ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. సకాలంలో రైతులకు రుణాలు, యంత్రాలు, వడ్డీ మాఫీ, బీమా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సుమంగళీ, పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు పిల్లి రాంబాబు, గంధ్రేటి అప్పారావు, కుడిపూడి శ్రీను, కొవ్వూరి చిన్న, వ్యవసాయాధికారి పి.స్పందన, డీఆర్‌సీ రాజులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇంటి పరిశీలన

ఇటీవల కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులతో కొడమంచిలి కుక్కల వారి పాలెంలో సానబోయిన శ్రీనివాస్ ఇటీవల నిర్మించుకొన్న ఇంటి కప్పు పూర్తిగా ఎగిరిపోవడంతో బుధవారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరిశీలించారు. నష్ట పరిహారం అందించడానికి కృషి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా వీరభద్రరావు



వీకె వీరభద్రరావు

నరసాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ పరిపాలనా అధికారిగా వికె వీరభద్రరావు బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడిగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. నరసాపురం పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం, పాలకొల్లు మండలపరిషత్ కార్యాలయాల్లో కూడా వివిధ హోదాల్లో పని చేశారు. బాధ్యతలు చేపట్టిన వీరభద్రరావు కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పరిపాలనా అధికారిగా పని చేసిన జీవీఎస్ రామకృష్ణ పదోన్నతి పొంది ఉంగ్రాజవరం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు



పేరుపాలెం సౌత్‌లో పంటబోదె తవ్వకం పనులు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాస్

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదెతవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. పేరుపాలెం సౌత్,జగన్నాదపురం, కోమటితిప్ప, వారతిప్ప, కొత్తోట, కాళీపట్నం తూర్పు గ్రామాల్లోని పంట బోదె తవ్వకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం పేరుపాలెం సౌత్ గ్రామంలో చేపట్టిన తవ్వకం పనులతో పాటు మస్తర్‌ను ఏపీఓ వై.శ్రీనివాస్ పరిశీలించారు.

గ్రంథాలయంలో యోగా పోటీలు



గ్రంథాలయంలో యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. ఈ నెల రోజులు యోగాలో శిక్షణ పొందిన ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం వంటి ఆసనాలపై విద్యార్థులతో పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే బొమ్మలు, బ్యాగులు తయారీ చేయించారు. కథలు, నీతి వ్యాఖ్యములు, డ్రాయింగ్, కుట్లు, అల్లికలు, చెస్, క్యారమ్స్‌పై గురువారం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి తెలిపారు. పోటీలు పూర్తయిన తరువాత ఆదివారం విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం



మేడపాడులో ఆరోగ్యకేంద్రం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



పెనుమర్రు వద్ద చించినాడ కాల్వలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: జగనన్న ప్రభుత్వంలో నవత్నాల పేరిట పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. మేడపాడులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను, నాడు నేడు పథకంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులను బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో అవినీతి, సిఫారసులకు అవకాశం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదన్నారు. అదే సమయంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందుకునేలా చేసిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు గుర్తు చేసి వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మరొకసారి జగనన్న ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా ప్రజలకు ఉత్తేజపరిచే బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పారు. ముందుగా పెనుమర్రు వద్ద చించినాడ కాల్వలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, గంధం సత్యకీర్తి, డేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు, గాది వరదయ్య, బాలం అంజిబాబు, వర్ధనపు వెంకటేశ్వరరావు, కుక్కల సుబ్బారావు, కుక్కల ఆంజనేయులు, కుక్కల సూరయ్య, కుక్కల బాలచంద్రన్, గుత్తుల వెంకట్రావు తదితరులు ఉన్నారు.

నేడు చీఫ్ విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం నియోజకవర్గంలో అందుబాటులో ఉండరు. ఉదయం ఏలూరులో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఆయన అమరావతి వెళ్తారు

వైభవంగా గణపతి హోమం



పాలకొల్లులో శ్రీ లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు



పెనుగొండలో సంకష్ట హర చతుర్థి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. మారేపల్లి పేరిశాస్త్రి బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 17 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ భక్తులకు స్వామివారి శేషవస్త్రంతో పాటు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: సంకష్ట హర చతుర్థి సందర్భంగా పెనుగొండ పంచాయతీ వద్ద సంపత్ వినాయకుని ఆలయం వద్ద లక్ష్మీ గణపతి హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వడగం సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కావూరి బాలకృష్ణ శర్మ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 2007 నుంచి ఆలయంలో హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తేతల శ్రీరామారెడ్డి తెలిపారు.

నేడు మావుళ్లమ్మ జాతర

భీమవరం (ప్రకాశం చౌక్): మావుళ్ళమ్మవారి జ్యేష్ఠ మాస జాతర మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి జాతరలో పాల్గొనాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఎల్‌వీఎన్ పురంగా గ్రామ శివారుకు చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన మోకా అర్జునరావు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు.ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ సర్వేతో పారదర్శకంగా హద్దులు



పోడూరులో డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్

పోడూరు: డ్రోన్ సర్వేతో వ్యవసాయ భూములకు పారదర్శకంగా హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు అన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో భాగంగా పోడూరులో బుధవారం డ్రోన్ సర్వే ను ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దాదాపు 100 ఏళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా డ్రోన్ ద్వారా రీ సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ప్రయోజనాల కోసం రూపకల్పన చేసిన జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం ద్వారా దేశ వ్యాప్తంగా మన రాష్ట్రంలో మాత్రమే వ్యవసాయ భూముల రీసర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. దీని ద్వారా అటు ప్రభుత్వానికి, ఇటు రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రీసర్వే ప్రక్రియకు రైతులంతా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోడూరు, మినిమించిలిపాడు సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, రామన వీర్రాజు, ఆర్ఐ కె.రాంబాబు, వైస్ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, వీఆర్‌ఓలు ఎస్.కుమార్, వర్మ పాల్గొన్నారు.

నేడు లక్ష్మణేశ్వరం ఉప సర్పంచ్ ఎన్నిక

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం ఉపసర్పంచ్ పదవికి గురువారం ఉదయం 11గంటలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. గ్రామంలో ఉప సర్పంచ్‌గా ఎన్నికైన దేవిరెడ్డి రామారావు తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎన్నిక ప్రక్రియకు ఎన్నికల అధికారిగా మొగల్తూరు ఈఓపీఆర్డీ నవీన్ వ్యవహరిస్తున్నారు. గ్రామ కార్యదర్శి యర్రంశెట్టి సత్యనారాయణ సహాయకులుగా వ్యవహరిస్తారన్నారు.

ఖండాంతరాలు దాటిన పాలకొల్లు పాపిడి ఖ్యాతి



పాలకొల్లులో పాపిడి తయారీ చేస్తున్న మహిళలు

- క్షీరపురి నుంచి గల్ఫ్ తీరాలకు రవాణా....
- 70 ఏళ్ల నుంచి పాలకొల్లులో పాపిడి తయారీ
- 50 కుటుంబాలకు ఉపాధి

పాలకొల్లు అర్బన్: క్షీరపురి ప్రజల నోరు తీపి చేసింది...గల్ఫ్ దేశాలతో పాటు అమెరికా వరకు వెళ్లి తన ప్రాధాన్యత పెంచుకుంది...సాంప్రదాయ విందు భోజనాల్లో అరిటాకులో చేరి చిన్నా, పెద్దలను మురిపించింది. ఎంతో ఇష్టంగా ఆరగించే స్వీట్‌గా పాపిడి ప్రత్యేకతను నిలుపుకుంది. ఉమ్మడి జిల్లాల్లోనే కాక రాష్ట్రంలో మరెక్కడా లభించని పాపిడి పాలకొల్లులో ప్రసిద్ధి చెందింది. పాలకొల్లు పాపిడి అంటే అబ్బురపడి తింటుంటారు. కాకినాడ గొట్టం కాజా, ఆత్రేయపురం పూతరేకు మాదిరిగా పాలకొల్లు పాపిడికి మంచి గిరాకీ ఉంది. చౌకగా లభించే ఈ స్వీట్ అందరికీ తెగ నచ్చేస్తుంది.

70 ఏళ్లుగా తయారీ

పాలకొల్లు పట్టణంలోని గుత్తులవారిపేటకు చెందిన దివంగత గుత్తుల కృష్ణ, అతని భార్య అనంతలక్ష్మి జీవనోపాధి కోసం ఈ పాపిడి తయారీ చేసి పాలకొల్లు పట్టణ వీధుల్లో విక్రయించేవారు. కాలక్రమంలో ఇది కుటీర పరిశ్రమగా మారింది. గుత్తులవారి పేటలో సుమారు 50 కుటుంబాలు ఈ పాపిడి తయారీ చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ స్పెషల్ పాపిడి పాలకొల్లులో తప్ప మరెక్కడా లభించదు.

విందు భోజనాల్లో పాపిడికి ప్రత్యేక స్థానం

విందు భోజనాల్లో పాపిడికి ప్రత్యేకత ఉంది. వివాహాది శుభ, కార్యాలు, బర్త్‌డే వేడుకలు, ఇతర ఫంక్షన్లలో పాపిడికి ప్రాధాన్యత ఇస్తారు. దీంతో ఏడాది పొడవునా ఈ పాపిడి తయారీదారులకు చేతినిండా పని ఉంటుంది. ముఖ్యంగా ఆర్డర్లపైనే ఈ పాపిడి తయారు చేస్తారు. గాలి తగిలితే బిగుసుకు పోయే గుణం ఉన్న ఈ పాపిడి అందంగా తెల్లటి మైకా కవర్లలో ప్యాక్ చేసి చూడ ముచ్చటగా ఉంటుంది.

పాలకొల్లు నుంచి అమెరికా వరకు..

తెలుగువారి లోగిళ్లను మురిపించిన పాపిడి పాలకొల్లు నుంచి అమెరికా వరకు తన ప్రయాణం కొనసాగించింది. ఇక్కడ నుంచి అమెరికాలో ఉన్న తెలుగువారి కుటుంబాలకు సరఫరా చేస్తారు. అంతేకాకుండా ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు అక్కడ ఉండే తెలుగువారి కోసం ఎంతో ప్రేమగా తీసుకువెళుతుంటారు. దేశంలోని అన్ని ముఖ్య నగరాలతో పాటు, పట్టణాలకు బంధువులకు, స్నేహితుల కోసం పాపిడిని తీసుకువెళ్లి అభిమానం చాటుకుంటారు.

తయారీ ఇలా..

పంచదార, మైదా, డాల్డా కలిపిన మిశ్రమంతో తయారు చేసిన పాపిడి కిలో రూ.200 చొప్పున, అలాగే నెయ్యి, శెనగపిండి, పంచదార మిశ్రమంతో తయారు చేసిన పాపిడిని కిలో రూ.400 చొప్పున విక్రయిస్తారు. పంచదార పాకం పట్టి, ఆ పాకాన్ని డాల్డాతో కలిపి, అనంతరం మైదా కలిపి జీళ్ల తయారీ మాదిరిగా సాగదీస్తారు. సన్నటి పొరలు వచ్చే వరకు వీటిని సాగదీసి అనంతరం కప్పు పరిమాణంలో పాపిడిని ఒక ఆకృతిలో తయారు చేసి విక్రయానికి సిద్ధం చేస్తారు.

జీవనోపాధి కోసం పాపిడి తయారు చేసేవాళ్లం



సుమారు 70 ఏళ్ల క్రితం తన భర్త గుత్తుల కృష్ణ, నేను కలిసి పాపిడి తయారీ చేసేవాళ్లం. అప్పట్లో జీవనోపాధి కోసం ఈ మార్గం ఎంచుకున్నాం. ప్రారంభంలో పెద్దగా వ్యాపారం సాగేది కాదు. పాలకొల్లు వీధుల్లో తిరిగి పాపిడి అమ్మే వాళ్లం. ఇప్పుడు పదిమందికి ఉపాధి కలిగింది. ప్రస్తుతం వ్యాపారం బాగానే సాగుతుంది.

–గుత్తుల అనంతలక్ష్మి

ఆర్డర్లు వస్తేనే ఉపాధి



వినాయక చవితి, దశమి, శ్రీరామ నవమి, అన్నసమారాధనాలు సమయంలో ఆర్డర్లు బాగా వస్తాయి. అలాంటప్పుడు వ్యాపారం బాగానే సాగుతుంది. ఆర్డర్లు లేని సమయంలో రోజుకి రెండు నుంచి మూడు పాకాలు వేసుకుని చిల్లరగా అమ్ముకుంటాం. పాలకొల్లు పట్టణంలోని 40 మంది వరకు ఇదే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు.

–పెచ్చెట్టి లక్ష్మి విమల